# లాలూచి!

డిపార్ట్‌మెంట్ హెడ్ గోవర్ధన్‌రావ్ అంటే అందరి దృష్టిలో ఒక వైట్ ఎలిఫెంట్! కొన్నేళ్లుగా కులం అతడిని కాపాడుతూ వచ్చింది. కుల రాజకీయాలు నడపటంలో దిట్ట! మంత్రుల మూతులునాకి అడక్కుండానే పై వారికి మూటలుముట్టచెప్పి పోస్ట్ పదిలం చేసుకుంటూ వస్తున్న మేధావి!

గొడ్డు గడ్డి మేయటం ఎలాగో పవర్లో వున్న వాళ్లూ డబ్బు మేయటమనేది జరుగుతూంటుందని అతగాడి ఒపీనియన్.

అవినీతి సముద్రంలో స్వేచ్ఛగ యదేచ్ఛగా ఈదులాడుతున్న తిమింగలం గోవర్ధనరావ్!

అతని బాల్యం దయనీయంగా గడిచింది. దరిద్రంలో పెట్టి పెరిగాడు. పదేళ్ళొచ్చేదాకా కట్టుగుడ్డలేక గోచితో తిరిగినవాడు.

గోవర్ధన్‌రావ్ తండ్రి రోజూ కూలికీ పోయి ఏదో నాలుగు డబ్బులు సంపాదించేవాడు. నలుగురిళ్లల్లో పాచి పని చేసి కష్టపడేది తల్లి.

అరడజను మంది సంతానాన్ని పోషించటానికి కిందమీద పడేవాడు. పిల్లల అర్ధాకలి తీర్చి పెద్దవాళ్లు పస్తులున్న రోజులు చాలా వున్నాయ్.

గోవర్ధన్‌రావ్‌కి పలక బలపంతీసుకుని బడికెళ్లాలని వుండేది. చదువెందుకు...? గొడ్లు కాచుకు రమ్మని తల్లీతండ్రి పోరు పెట్టేవాళ్లు.

ఏడ్చిగోల చేసి తన్నులు తిన్నా సరే ప్రాథమిక పాఠశాలకెడుతూ వచ్చాడు. పలకకైనా నోచుకోక నేలమీద ఇసుకలో అక్షరాలు దిద్దాడు. టీచర్ చెప్పేది శ్రద్ధగా విని పక్క పిల్లల పుస్తకాలు అరువు తీసుకుని చదివి వప్ప చెప్పటం చూచి ఇతని శ్రద్ధకి విస్తుపోయారు.

ఈ అంట్ల వెధవకి ఎన్ని తెలివితేటలో. చెప్పింది చిటికెలో గ్రహిస్తాడు. ఆ ఇంట తప్ప బుట్టాడు అంటూ టీచర్లు ముక్కున వేలేసుకునేవారు.

తల్లికి జ్వరమొచ్చి పన్లోకి పోలేనప్పుడు గోవర్ధన రావు తమ గుడిసెకు ఎదురుగా మిద్దె ఇంట్లో వున్న మౌలాలి సాయిబు ఇంటికెళ్లి నిలబడే వాడు.

మౌలాలి తోళ్ల వ్యాపారం చేసి సంపాదించాడు. గుడిసెలో పుట్టినా... గోవర్ధన్‌రావు తెలివి తేటలు చూస్తూ మురుస్తుంటాడు.

మౌలాలి వేప పుల్లతో పళ్లుతోముకుంటూ అటు ఇటు పచార్లు చేస్తున్నాడు.

బిక్కముఖమేసుకుని నిలబడిన గోవర్ధన్‌రావ్ ఎదురుగానిలబడి వుండటం చూచి 'ఏందిరా నువ్వొచ్చినవ్' అడిగాడు.

'అమ్మకు జ్వరమొచ్చింది. మంచంలో వుంది. అయ్య పనిలోకెళ్లాడు. మీ ఇంట్లో పాచి పని చేయటానికొచ్చినా'

'నువ్వు బడికి పోవురా మరి?- చెట్టు మొదట్లో వుమ్మి వేసుకుంటూ అడిగాడు మౌలాలి.

లేదంటూ తల అడ్డంగా ఆడించాడు.

'మీయమ్మ జరం తగ్గేక పన్లోకొస్తుంది గానీ నువ్వు స్కూలుకు పో... నువ్వు తెలివైనోడివిరా... చదువు మానొద్దు... బాగా సదవాలి...' భుజం తట్టి గోవర్ధన్ రావ్‌ని వెనక్కు పంపేడు మౌలాలి.

'మరి... మాకు బువ్వెట్లా సారూ? వెళ్ల బోయిన వాడల్లా ఆగి వెనక్కు తిరిగి అడిగేడు.

'బువ్వ లేకున్నా సరే.... నువ్ సదువు మానొద్దు' పెళ్లాన్ని కేకేసి పదికిలోల బియ్యం సంచిలో పోసి గోవర్ధన్‌రావ్ చేతికిచ్చాడు.

'అవున్రా... మీ అయ్యేడికిపోయాడు కన్పించటం లేదు..!

రెండ్రోజుల క్రితం పన్లోకెళ్లి మేడ మీది నుంచి పడ్డాడు. అట్నుంచి అటే ఆసుపత్రికి తీసుకెళ్లారు. నేనెళ్లి చూసొచ్చినా... ఇంటికి పంపించటానికి సానా రోజులు పడతదంట...' చేత్తో కళ్లు తుడుచుకున్నాడు.

'అట్టనా!... అవసరానికి డబ్బు నన్నడుగు ఇస్తా...'

'సరేనని తలూపి బియ్యం సంచీ బుజానికి తగిలించుకున్న గోవర్ధన్ ముందుకు నడిచాడు.

★★★★★

మౌలాలి సహాయంతో బి.సి. హాస్టల్లో చేరిన గోవర్ధనరావు మెరిట్ స్టూడెంట్‌గా నిలిచి చివరికి ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేశాడు.

ఫైనలియర్ చదువుతుండగా తండ్రి చనిపోవటం మరో దురదృష్టమైంది.

మౌలాలీకి పిల్లల్లేని కారణంగా గోవర్ధన్‌రావ్ కుటుంబానికి కొండంత అండగా నిలిచాడు.

తండ్రి లేని కుటుంబానికి ఆలనపాలన అన్నీ మౌలాలి భుజాన వేసుకుని ఆదుకున్నాడు.

మౌలాలి అంకుల్ సహాయం లేకపోతే తాను ఇంజనీర్ అయ్యే వాడే కాదు. తన తరువాత తమ్ముళ్ల కోసం చెల్లెళ్ల కోసం తాను చదివి ప్రయోజకుడై అందరినీ పోషించాలనీ, గౌరవంగా

సమాజంలో బ్రతకాలనే సంకల్పంతో గోవర్ధన్‌రావ్ శ్రమించి చదువు పూర్తి చేసాడు.

తల్లి అనారోగ్యం గురించి గోవర్ధన్‌రావ్‌కి తెలీనిచ్చే వాడు కాదు మౌలాలి. అతనిచదువుకి ఎక్కడ ఆటంకం కలుగుతుందో ననే భయంతో సర్వం తానే అయి చూచుకుంటూ వచ్చాడు మౌలాలి!

వైద్యానికి లొంగని రోగంతో మంచంలోనే కుమిలిపోతూ పడివుంది వెంకటమ్మ.

'మౌలాలన్నా...నేనింక బ్రతకను. నా పనిఅయిపోయింది. పెద్దోడిని సూసి కళ్లు మూస్తాను. నా మనసు ఆడి కోసమే ఆరాటపడుతోంది...' అసలే బలహీనంగా వున్న వెంకటమ్మ కళ్ల నీళ్లు పెట్టుకుంది.

'నీకేం ఫికర్లేదు. అల్లా అంతాసూస్కుంటాడు. మరో నాలుగు నెలల్లో గోవర్ధన్‌రావ్ చదువు పూర్తి చేసుకుని వచ్చేస్తాడు... బుజ్జగిస్తూ నచ్చ చెప్పాడు మౌలాలీ.

గోవర్ధన్‌రావ్ ఇల్లు చేరుకున్న రెండో రోజునే వెంకటమ్మ కళ్లుమూసి అందరినీ దుఃఖసాగరంలో ముంచేసింది.

★★★★★

మౌలాలి అంకుల్‌ఇంటిముందున్న అరుగు మీద కూర్చున్న గోవర్ధన్ రావ్ న్యూస్ పేపర్ తిరిగేస్తూ అన్నాడు.

'బేటా... నీ సదువు పూర్తి అయింది. నీకు వుద్యోగం రావాలి... పెళ్లాం కావాలి... ఈ రెండు కళ్లతో సూడాలి'... నవ్వుతూ అన్నాడు మౌలాలి.

'పెళ్లి మాట తర్వాత. ముందు ఉద్యోగం రావాలి. పేపర్లోంచి తలబైట పెట్టి అన్నాడు గోవర్ధన్‌రావ్.

'నీకో విషయం చెప్పాలనుంది బేటా! మన వూరి ఎమ్ఎల్ఏ అప్పల నర్సయ్య లేడూ.. ఆయున మూడో కూతురిని నీకిచ్చి పెళ్లి చేయాలనుందని మొన్నీ మధ్య నాతో అన్నాడు..నువ్వేమంటావ్?

మౌలాలి నోట వెంట వచ్చిన ఆమాటలు విన్న గోవర్ధన్‌రావు బిత్తరపోయాడు.

అప్పల నర్సయ్య ఎక్కడ? తానెక్కడ? ఆకాశమంత ఎత్తులో ఆయన.. నేల మీద తాను?

తల్లీ తండ్రీఎవ్వరూ లేని తనకు అప్పల నర్సయ్య పిల్ల నివ్వాలనుకోవటం చిత్రంగా తోచింది.

'గుడిసెలో పుట్టిన వాడిని. నీ అండలో పై కొచ్చిన వాడిని... తిండికి గతిలేని వాడిని... నా వంటి దురదృష్టవంతుడికి ఎం.ఎల్.ఏ. గారుతన కూతురిని ఇవ్వటమా? నో..

నమ్మశక్యంగాలేదు అంకుల్... నాకు అంత పేరాశ లేదు... చేతిలో పేపరు మడిచి పక్కన పెట్టాడు.

'అరెచుప్! నీ సదువు... తెలివి చూసి కూతుర్ని ఇవ్వటానికి ముందుకొచ్చాడు. కొన్నాళ్ల క్రితం ఆయన గారి కుటుంబానికి కూడా తిండికి తికానా లేదు. అదృష్టం బావుండి ఎన్నికల్లో పోటీ చేసి మినిష్టరైండు. ఆయనా నీకు మల్లే బికారి మనిషే. ఆయన కూతురు సక్కని సుక్క! నువ్ సరే నంటే..నీ కష్టాలు గట్టెక్కుతయ్... నీకు వుద్యోగం ఆయనే ఇప్పించు కుంటాడు. నీ నీడలో తోడ బుట్టిన వాళ్లూ పైకొస్తారు. నా మాట విను బేటా...' బ్రతిమిలాడాడు మౌలాలి.

'నీ మాట నాకు వేద వాక్కు అంకుల్! నువ్వే నాకు అమ్మ నాన్న అల్లా, అన్నీనూ...'

తనపట్ల గల గౌరవాభిమానాలకు మురిసి పోతూ గోవర్ధనారావ్‌ని కౌగిలించుకున్నాడు మౌలాలీ!

గోవర్ధన్‌రావ్ తెలివి తేటలు చదువు చూచి అప్పల నర్సయ్య.. అతగాడి విగ్రహం అందం చూచి కూతురు నిచ్చి పెళ్లి చేయడానికి వొప్పేసుకున్నారు.

అంగరంగ వైభవంగా కూతురి పెళ్లి చేసాడు మినిష్టర్ అప్పలనర్సయ్య.

మేడ్‌ఫర్ ఈచదర్‌లా వున్న పెళ్లి జంటని చూచి వచ్చిన బంధువులు ముచ్చట పడ్డారు.

పెళ్లి జరిగి పదిరోజులైనా కాకముందే గోవర్ధన్‌రావు తన తమ్ముళ్లతో చెల్లెళ్లతో ఫామిలీని సిటీకి షిఫ్ట్ చేసాడు.

మౌలాలి అంకుల్ కన్నీటితో వీడ్కోలు చెప్పటం చూసి గోవర్ధన్‌రావు హృదయం ద్రవించింది.

★★★★★

సర్వీసు కమీషన్ ద్వారా పాస్ చేయించి అల్లుడికి ఇంరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ ఇంజనీర్‌గా పోస్టింగ్ ఇప్పించాడు అప్పల నర్సయ్య.

రెండేళ్లు తిరగక ముందే దొడ్డి దోవన ఎ.ఇ.గా గోవర్ధన్‌రావ్‌కి ప్రమోషనొచ్చింది.

సీనియారిటీ తుంగలో తొక్కి మరో నాలుగేళ్లు గడవకముందే....డి.ఇ.గా ప్రమోషన్ కొట్టేసాడు గవర్ధన్‌రావ్.

మామగారు పవర్‌లో వుండగానేఅంచలంచలుగా ప్రమోషన్లు కొట్టేసిన మేధావి గోవర్ధన్ రావ్. దీపం వుండగానే ఇల్లు చక్కదిద్దుకో గలిగాడు.

చదువు పూర్తి అయిన తమ్ముళ్లకి తగిన వుద్యోగాలిప్పించుకున్నాడు. ఇద్దరు చెల్లెళ్ల

పెళ్లిల్లు చేసి తనపై గలబాధ్యత తీర్చేసుకోగలిగాడు.

వరుసగా ఎన్ని ప్రమోషన్లొచ్చినా సిటీ నుంచి బైటికి ట్రాన్స్ఫర్ కాకుండా వున్న చోటే సుస్థిర నివాసం ఏర్పరచుకున్నాడు.

టెండర్లు పిలవకుండానే వర్క్స్ ఎలాట్‌మెంట్స్.. కాంట్రాక్టర్లతో పర్సంటేజీలాలూచీలు... కళ్లు మూసుకుని నాసిరకం వర్క్సు కూడా బిల్లులు పాస్ చేయగలిగే స్థాయికి ఎదిగాడు.

తాను నోరుతెరిచి అడక్కుండానే కాంట్రాక్టర్లు డబ్బు సంచీలతో తెచ్చి కట్టలు కుమ్మరించి పోతున్నారు.

కటిక దరిద్రంలో పుట్టి పెరిగినవాడు కావటంతో కసికొద్దీ సంపాదిస్తున్నాడు. జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

చీమ చిటుక్కు మంటే చాలు మామగారు పైనుండి చక్రం అడ్డేస్తున్నాడు. అన్ని విధాలా అల్లుడిని రక్షిస్తున్నాడు అప్పల నర్సయ్య.

ఇదంతా మౌలాలీ అంకుల్ చలవే! ఆయనే కనుక తన్ను ఆదుకోకుండా వుంటే... తన బ్రతుకు ఎంత దుర్భరంగా వుండేదో?

దేవుడు లాంటి ఆంకుల్ మరణవార్త విని తన సర్వస్వం పోగొట్టుకున్న వాడిలాగా విలపించాడు గోవర్ధనరావ్. ఆఖరి చూపుకూడా తనకు దక్కలేదు. సియ.ం. గారి టూర్లో వున్నందున వెళ్లలేక పోయిన తన నిస్సహాయతకు మనసులో విలవిల్లాడాడు.

★★★★★

ఉదయం ఆరు గంటల సమయం!

సిటీలో జన సంచారం అప్పుడే బైటికొస్తున్న క్షణాలు.

ఎ.సి. రూమ్‌లో మెత్తటి పరుపు మీద పడుకున్న గోవర్ధన్‌రావ్ ఇంకా నిద్ర మేల్కోలేదు.

... గోవర్ధన్‌రావ్ బంగళాముందు నాలుగు జీపులొచ్చి ఆగినయ్. అందులో నుంచి దిగిన అధికార బృందం గబగబా లోపలికి నడిచింది.

వారెవరో! ఎందుకొచ్చారో తెలీక ఇంట్లో వాళ్లు నిర్ఘాంత పోయారు.

వచ్చిన అధికారులు బంగళా అంతా గబగబ కలియ తిరిగారు. ఎవ్వరినీ బైటికి కదలవద్దని తలుపులు గడియ పెట్టారు.

నౌకర్లు కంగారుపడి వెళ్లి అయ్యగారిని నిద్ర లేపారు.

బద్ధకంగా లేచి వళ్లు విరుచుకుని ... అవులించి కళ్లు నలుపుకున్నాడు గోవర్ధనరావ్.

ఎదురుగా ఎ.సి.బి. స్క్వాడ్ ఇన్చార్జ్ ఆఫీసర్ షన్ముగాన్ని చూచి నివ్వెరపోయాడు గోవర్ధన్‌రావు. నోటి వెంట మాట కరవైంది. వళ్లంతా ముచ్చెమటలు పోయసాగాయి.

ఇలాంటి విపత్కర పరిస్థితి ఎదురౌతుందని గోవర్ధన రావ్ కలలో కూడా వూహించలేదు. కొండంత అండ మామగారున్నాడు? కదానే ధీమాలో వున్నాడుఇన్నాళ్ళూ!

సమయానికి మామగారు కూడా అందుబాటులో లేడు. టూర్ మీద విదేశాలకు వెళ్లాడు. మరో పది రోజులవరకూ గాని తిరిగి రాడు.

ఈ లోపున తన కొంప కొల్లేరౌతుంది. తన ఇంటి దీపం ఆరి పోతుంది. తనను ఆదుకునే వారుండరు.

గోవర్ధన్‌రావులో భయం తాలూకు వణుకు మొదలైంది.

ఇన్నాళ్లూ తన కెదురులేదని విర్రవీగాడు. తన కేం కాదనే ధీమాతో వున్నాడు. తీరా ఇప్పుడు పుట్టి మునిగే పరిస్థితి ఎదురైంది.

తన గొయ్యి తాను తవ్వుకున్నట్టయింది! మామను అడ్డం పెట్టుకుని కోట్లు సంపాదించాడు. ఇప్పుడు డీలా పడ్డాడు.

దాడి తాలూకు సర్చి ముగిసింది! ఇంట్లో దొరికిన క్యాషు... బంగారం... బేంకు పాస్‌బుక్స్.. బేంకు లాకర్స్... డిపాజిట్లు తాలూకు సర్టిఫికేట్లు...ఫారమ్ హౌస్... ఇళ్లప్లాట్లు... కొన్ని పొలం తాలూకు కాగితాలు..షేర్లు.... వగైరాలన్నిటితో కూడిన లిస్ట్ ప్రిపరేషన్లో తలమునకలవుతోంది రైడ్ చేసిన ఎ.సి.బీ. బృందం.

పాతిక లక్షల క్యాషు... బంగారు బిస్కెట్లు... నగలు.. వెండి... సామాను చూడగానే అధికార బృందంలో వారికి కళ్లు కుట్టాయి.

ఎన్నేళ్లు తాము సర్వీసు చేస్తే ఇంత సంపాదించగలం అనే ప్రశ్న వారి మదిలో ఉత్పన్నమైంది.

ఇట్లా ఎందరి ఇళ్ల మీదో ఆకస్మిక దాడి చేసి తనిఖీలు నిర్వహించి.... నల్ల ధనాన్ని వెలికితీసి ప్రభుత్వానికి అప్పగించి తమ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించటం జరిగింది. అయినా తమకు ఒరిగిందేమీ లేదు. కేవలం పై అధికారుల మెచ్చుకోళ్లు... అభినందనలు మాత్రమే తమకు మిగిలినయ్!

ఈ డబ్బు కోసమేగా అందరూ ఇన్నిన్ని పాట్లు పడటం? అవినీతి పరులుగా మారటం!?

'ధనమేరా అన్నిటికి మూలం' అనే పాట గుర్తుకొచ్చింది అధికారులకు.

తనిఖీ అధికారుల నోళ్లలో లాలా జలం వూరింది. వారి సిన్సియారిటీని డ్యూటీ మైండ్‌నెస్‌కి గుడ్‌బై చెప్పుకున్నారు మనసుల్లో!

గోవర్ధన్‌రావ్ మంత్రిగారి అల్లుడు! రేపు ఆయన విదేశాల నుంచి వచ్చేక విషయం తెల్సుకుని తమపై కారాలు మిరియాలు నూరి ద్వజం ఎత్తుతాడు.

తమని సుదూర ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేయిస్తాడు. అప్పుడు తమనెవరూ ఆదుకునే వారుండరు.

అంచేత... ఉభయ తారకంగా... గొవర్ధన్‌రావ్‌తో లాలూచీ పడటమే తరుణోపాయంగా తోచింది. ఎ.సి.బి. అధికారులకు.

గోవర్ధన్‌రావ్ నీళ్లు నములుతున్నాడు. రెడ్ హేండెడ్‌గ దొరికిపోతున్నందుకు మానసికంగా వేదనకు గురౌతున్నాడు.

అతని మానసిక క్షోభ గుర్తించిన అధికార బృందం తమలో తాము చెవులు కొరుక్కుని... గోవర్ధన్‌రావు చెవి కొరికేరు.

గోవర్ధన్‌రావు మనసు ఎగిరి గంతేసింది. డబ్బు పోతే పోయింది. పరువైనా దక్కుతుందన్పించి వారి ప్రపోజల్‌కి ఎస్సన్నాడు.

ఇంకేముంది. పాతిక లక్షల హార్డుక్యాష్ ఎ.సి.బీ. వారి పరమైంది. మిగతా వాటిని అక్కడే వదిలేసారు.

దొరికిన పాతిక లక్షలూ ఆ వచ్చిన అధికార బృందం సమంగా పంచుకుని బేగ్స్‌లో సర్దుకుని గోవర్ధన్‌రావ్‌కి 'బై' చెప్పి బంగళాలోంచి బైటికొచ్చి వారివారి జీపులెక్కి వెను తిరిగి వెళ్లిపోయారు.

సిటీ మనశ్శాంతితో ... ప్రశాంతంగా తెల్లవారింది.

గవర్ధన్‌రావ్ కాఫీ చప్పరిస్తూ న్యూస్ పేపర్ తిరిగేసాడు.

.... గోవర్ధన్ రావ్ ఇంటిమీద ఎ.సి.బి. వారి దాడి! సేకరించిన వివరాలను బట్టి... ఇంట్లో దొరికిన ధనకనక వస్తువాహనాలన్నీ కేవలం ఆయన కష్టార్జితమే ననే విషయం బుజువైంది.

ఆ మేరకు ఎ.సి.బి. బృందంపై అధికారులకు నివేదిక సమర్పించటం జరిగింది.

న్యూస్ పేపర్లో వార్త చదివిన గోవర్ధన్‌రావ్ తన్లోతాను ముసిముసిగ నవ్వుకున్నాడు.

లాలూచీ పడినందుకు డబ్బుపోయినా సొసైటీలో తన పరువు పోనందుకు సంబర పడ్డాడు!!

-:(సమాప్తం):-